3 నుంచి11 వరకు
పద్మాపురం బొటానికల్ గార్డెన్ మూసివేత

ప్రజాశక్తి- అరకులోయ : . పర్యాటకులకు మరింత ఆకర్షించే విధంగా ప్రముఖ పర్యాటక కేంద్రం పద్మాపురం బొటానికల్ గార్డెన్‌ను ఆధునీకరిస్తున్న నేపథ్యంలో ఈనెల 3 నుంచి 11 వరకు దీనిన మూసేస్తున్నామని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి..అభిషేక్ ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీలోని పర్యాటక అందాలకు మరింత మెరుగులు దిద్ది, సందర్శకులను ఆకట్టుకున్న విధంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని, ఈ క్రమంలోనే పద్మాపురం గార్డెన్‌ను అభివృద్ధి, ఆధునికీకరిస్తున్నట్లు వెల్లడించారు. పద్మాపురం గార్డెన్ సందర్శనకు పర్యాటకులు రావద్దని కోరారు. ఆధునీకరణ, విద్యుదీకరణ పనులు పూర్తయిన తర్వాత పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పర్యాటకులు గమనించాలని, పద్మాపురం బొటానికల్ గార్డెన్‌కు రావద్దని కోరారు.

వెంటాడుతున్న డోలీ కష్టాలు

★ నూతన సంవత్సరాదిన శిశువు, బాలింతలను ఆసుపత్రికి తరలింపు

★ రెండు కిలోమీటర్లు కొండమార్గంలో వాగులు దాటుతూ పయనం

★ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించిన పంచాయతీలోనే ఘటన

ప్రజాశక్తి -అనంతగిరి :మన్యవాసులను డోలీ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. గర్భిణుల ప్రసవాలు, బాలింతలు, శిశువుల అనారోగ్య సమస్యలు, సీజనల్‌గా ప్రబలే వ్యాధులతో ఏజెన్సీవాసుల అస్వస్థత ఇలా సమస్య ఏదైనా, వారు సరైన వైద్యానికి వెళ్లాలంటే సంబంధీకులు, గ్రామస్తుల సాయంతో డోలీలో మోసుకుంటూ ఆసుపత్రులకు వెళ్లాల్సిందే. అనేక మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ఈ దుస్థితి అనివార్యమైతే, ఇంకొన్ని గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో అంబులెన్స్‌లు, వాహన రాకపోకలకు వీలు లేక డోలీలను ఆశ్రయించక తప్పని పరిస్థితి. ఈ ఏడాది వర్షాలకు బోనూరు వెళ్లే రోడ్డులో కల్వర్టు కొట్టుకుపోవడంతో గడ్డిబందకు చెందిన బాలింత, నవజాత శిశువులను ఇలాగే రెండు కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటించిన పినకొండ పంచాయతీ పరిధిలోఈ ఘటన జరగడం చర్చనీయాంశమైంది. తమకు ఈ దుస్థితి నుంచి ఎప్పటికి విముక్తి కలుగుతుందోనని మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు.

మండలంలోని పినకొట పంచాయతీ కొండశివారున ఉన్న శికారు గడ్డిబంద గ్రామానికి చెందిన తామర్ల .పైడితల్లి అనే గిరిజన గర్భిణికి బుధవారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి. గ్రామం నుంచి ఆసుపత్రికి తరలించాలంటే మార్గమధ్యలో భారీ కల్వర్టు ఈ ఏడాది వర్షాలకు కొట్టుకుపోవడంతో డోలీ మోత తప్పనిస్థితి. గర్భిణి పురిటి కష్టాలను చూసిన కుటుంబీకులు డోలీ ఏర్పాట్లు చేస్తుండగానే, పైడితల్లి ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఇంటి వద్దే ప్రసవించింది. అయితే కాన్పు కష్టం కావడంతో బాలింత, నవజాత శిశువులకు మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించాలని భావించిన కుటుంబీకులు డోలీ కట్టి బాలింతను అందులో కూర్చుండబెట్టి, దానికి కట్టిన కర్రకు ముందు భాగాన మహిళ తలపై పెట్టి మోయగా, వెనుకన మరో పురుషుడు డోలీని మోస్తూ దాదాపు రెండు కిలోమీటర్లు కల్వర్టు కూలిన గెడ్డలోనూ, కొండమార్గాన మోసుకెళ్లి బోనూరు వరకు తరలించారు. అపుడే పుట్టిన బిడ్డను మరో మహిళ తన పొత్తిళ్లలో పట్టుకుని వెంట నడవగా తల్లీబిడ్డలిద్దరినీ మోసుకుంటూ బోనూరు తీసుకెళ్లి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో పినకొండ ఆసుపత్రికి తరలించారు.



బాలింతను. శిశువును డోలీ సాయంతో గెడ్డ దాటిస్తూ వైద్యానికి తరలిస్తున్న కుటుంబీకులు



తమ దుస్థితిపై దృష్టి సారించాలని వేడుకుంటున్న బాధితురాలు

కల్వర్టు కొట్టుకుపోవడం వల్లే ఈ పరిస్థితి

గడ్డికొండ నుంచి బోనూరు మెయిన్ రోడ్డుకు వెళ్లే మార్గంలో గెడ్డపై భారీ కల్వర్టు ఈ ఏడాది వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పండింది. కూలిపోయిన కల్వర్టు వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వపరంగా అధికారులు చొరవ చూపకపోవడం కూడా గిరిజనుల కష్టాలకు కారణమౌతోందని వారు ఆవేదన చెందుతున్నారు. కాగా తాజాగా డోలీలో బాలింత, నవజాత శిశువును మోసుకెళ్లిన గడ్డికొండ గ్రామం, ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించిన పినకోట పంచాయతీ పరిధిలోకి రావడం కొనమెరుపు. తన పర్యటనలో డోలీ మోతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం ఏజెన్సీతోపాటు అన్ని ప్రాంతాల్లో రహదారులు కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సిఎం భరోసానివ్వగా, అది ఎప్పటికి కార్యరూపంలోకి వస్తుందోనని గిరిజనం ఆశగా ఎదురుచూస్తున్నారు.

నేతల ఇంట న్యూఇయర్ సందడి

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక రోడ్డు భవనాల శాఖ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి ఏజెన్సీలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పూలబొకేలు, స్వీట్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు యువత రంపచోడవరం నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్, మాజీ శాసనసభ్యులు చిన్నం బాబురమేష్, అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ వై.నిరంజనీ దేవి, అనంత మోహన్, సలాది బాపిరాజు, సూర్యనారాయణరాజు, పల్లాల వెంకట రమణారెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరకులోయ : అరకులోయలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గం కేంద్రంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవి బాబు, ఆర్‌టిసి విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు ఇన్చార్జి సియ్యారి.దొన్ను దొర, పెద్దలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టెలి.దాసుబాబు ఇలా పలువురు ప్రజాప్రతినిధులకు ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మత్స్య లింగానికి తన క్యాంపు కార్యాలయంలో, ఎమ్మెల్సీ రవిబాబుకు తన ఫామ్ హౌస్‌లో దొన్ను దొరకు నివాసంలో వెళ్లి బొకేలు అందిస్తూ, సాలువలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌టి కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, అనంతగిరి ఎంపిపి నీలవేణి, జయవర్ధిని, మాజీ జెడ్‌పిటిసిలు గంగన్నదొర, కాసులమ్మ, వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, కూడ సుబ్రహ్మణ్యం, సురేష్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అరకులోయ మండల ఎంఈఓ వి. త్రినాథ్ రావు, ప్రధానోపాధ్యాయులు, దయానిది, నపిరి రామారావు, కొండబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు షేమో, చిట్టిబాబు, గంగరాజు, దుక్కునాయుడు, తిరుపతి రావు, రమణ, శ్రీనివాసరావు, నారాయణ ,కొండబాబు, నందో, సింహాచలం, ఈశ్వరరావు, గోపాల్ రావు, మహాదేవ్, ధనార్జన రావు, రామ చందర్, నాగేశ్వరరావు, చందు, లక్ష్మణరావు, రామారావు, సహదేవ్ పాత్రుడు, రాజకీయ నాయకులు పాంగి చిన్నారావు, శెట్టి అప్పాలు, కార్తికో అరుణకుమారి, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

అనంతగిరి : అనంతగిరిలో నూతన సంవత్సరం పురస్కరించుకొని స్థానిక జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు ఎంపిపి శెట్టి నీలవేణిలను పలువురు మండల శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, స్వీటు బాక్సులు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు ఎంపిడిఒ ఎవివి. కుమార్, ఎటిడబ్ల్యుఒ వెంకటరమణ, ఎంఇఒ కె.బాలాజీ, సిడిపిఒ సంతోషికుమారి, హెచ్ఎం మంగ, పలువురు అధికారులు పాల్గొన్నారు



జెడ్‌పిటిసి గంగరాజుకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపిడిఒ



అరకులో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు




రంపచోడవరంలో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

కొత్తపల్లి జలపాతానికి పోటెత్తిన సందర్శకులు

ప్రజాశక్తి -జి.మాడుగుల :నూతన సంవత్సరాదిన బుధవారం కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున సందర్శకులు తాకిడితో సందడి నెలకొంది, జలపాతంతో కేరింతలు కొడుతూ జలకాలాడారు, ఆహ్లాదకరమైన వాతావరణం ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. కొత్తగా నిర్మించిన వ్యూ పాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలతో సందడి చేశారు.



కొత్తపల్లి జలపాతంలో జలకాలాడుతున్న చిన్నారులు, పర్యాటకులు



వ్యూపాయింట్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయండి

ఘనంగా యుటిఎఫ్ జెండా ఆవిష్కరణలు



అడ్డతీగలలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న యుటిఎఫ్ నేతలు, టీచర్లు

ప్రజాశక్తి-అడ్డతీగల

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్థాపించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈనెల 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ సభలు, 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.తేజోరావు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అడ్డతీగల మండల కేంద్రంలోని ఎంఆర్‌సి ఎదుట బుధవారం ఆ సంఘం జెండాను సీనియర్ కార్యకర్త పి.అప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తేజోరావు మాట్లాడుతూ కాకినాడలో జరగనున్న ఈ స్వర్ణోత్సవ వేడుకలకు ప్రతి ఉపాధ్యాయుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు అక్రమంగా చేసిన డెప్యూటేషన్లను యుటిఎఫ్ దశల వారీ పోరాటాల ఫలితంగానే రద్దు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కెవి.రాఘవులు, నాయకులు పి.మంగరాజు, జెబివి.రమణమ్మ, ఎస్.నాగప్రసాద్, జి.మల్లేశ్వరి, కె.చిన్నారావు, సిహెచ్.వెంకటేశ్వరరావు, సిహెచ్.సుందరరావు, పి.యర్రంరెడ్డి, డి.అశోక్ పాల్గొన్నారు.

విఆర్.పురం : యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు సందర్భంగా మండల కేంద్రం రేఖపల్లి సెంటర్‌లో యుటిఎఫ్ జెండాను బుధవారం సీనియర్ సభ్యులు బి.రవికుమార్ ఆవిష్కరించారు. స్వర్ణోత్సవ మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యస్.నాగేశ్వరరావు, జిల్లా అడిట్ సభ్యులు డివివి.సత్యనారాయణ మాట్లాడుతూ 1974లో ఏర్పాడిన యుటిఎఫ్ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయ సంక్షేమం, తద్వారా సమాజాభివృద్ధి కోసం కృషి చేస్తుందని చెప్పారు. అవిశ్రాంత పోరాటాలు, ఆర్థిక క్రమశిక్షణ, రాజీలేని అవినీతి వ్యతిరేక పోరాటాలు, స్వతంత్ర కార్యాచరణ, సమర్థ నాయకత్వం, కార్యకర్తల త్యాగ బుద్ధి వంటి విభిన్న లక్షణాలు కలిగి ఉండడమే గాక, ఐక్య ఉద్యమాలకు కేంద్రంగా పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు యన్.జగదీష్, కె.వెంకటేశ్వర్లు, యన్ రామకృష్ణ, యం బాబు, పి.రాజు, ఏ.రాము, కె రాజశేఖర్, టి.అర్జున్, పి లింగారెడ్డి, కె రమేష్, జె వెంకటరెడ్డి, సిహెచ్. వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



విఆర్.పురం మండలం రేఖపల్లిలో జెండా ఆవిష్కరణ చేస్తున్న యుటిఎఫ్ నేతలు

స్కూల్ శానిటేషన్ వర్కర్లకు
వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం

స్కూల్ శానిటేషన్ వర్కర్లకు బకాయి పడ్డ వేతనాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యాన బుధవారం రంపచోడవరం ఐటీడీఏ ఏపీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ శానిటేషన్ కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శాంతి రాజు మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా శ్రద్ధతో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు నూతన సంవత్సరం రోజున కూడా పస్తులతో ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలల బకాయి వేతనాలలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలు అధికారులు చెల్లించినట్లు చెబుతున్నా, కొంత మందికి మాత్రమే వేతనాలు పడ్డాయని, మరి కొంతమందికి ఆ మూడు నెలల వేతనాలు కూడా పడకపోవటంతో వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే బకాయి పడ్డ ఆరు నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.రాజమణి, పి.లక్ష్మీ ప్రసన్న, కుమారి, కోసు, విజయలక్ష్మి, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎపిఒకు వినతి పత్రం అందిస్తున్న స్కూల్ శానిటేషన్ కార్మికులు

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

నూతన సంవత్సర వేడుకల్లో ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

2025 సంవత్సరంలో ఏజెన్సీలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు పడి మంచి పంటలు పండి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆకాంక్షించారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి నివాస గృహ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పిఒ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రాజెక్ట్ అధికారి దంపతులకు బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో నెల్ వర్కు సేవలు, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో అందజేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఏపిఓ జనరల్ డిఎన్వి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం వెంకట ఇందిరా, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, పిహెచ్ఒ చిట్టిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, తహశీల్దార్లు కరక సత్యనారాయణ, సిహెచ్.శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, బాలాజీ, పిఏఓ రాంబాబు, ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్‌రావు దొర, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం దంపతులకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని పైడిగూడెం గ్రామానికి చెందిన కందుకూరి వరమ్మ అనారోగ్య కారణంగా ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఆర్థిక సహాయం అందజేశారు. వరమ్మ మృతితో ఆమె కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికులు విజ్ఞప్తి మేరకు మృతురాలి తనయుడు వెంకన్నకు జెకెసి ట్రస్ట్ చైర్మన్, ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్ బుధవారం రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల శ్రీరామ్, పసుపులేటి సాల్మన్ రాజు, జెకెసి ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె రసూల్, ఎస్‌కే రియాజ్, ఎస్కే షాజహాన్, నటరాజ్, రాచూరి చంద్రశేఖర్, వైహిదుల్ల ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్



రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దామనపల్లి పంచాయతీ దొడ్డికొండ గ్రామంలో 32 మంది వృద్ధులకు జీకే వీధి మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు దుమంతి, సత్యనారాయణ బుధవారం రగ్గులు పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా దృక్పథంతో ప్రతినెలా తమ జీవితంలో కొంత సొమ్మును కేటాయించి, ఆ సొమ్ముతో కొయ్యూరు, చింతపల్లి, జీకే.వీధి మండలాల పరిధిలో పేదలకు వస్తుదానం, విద్యాదానం, అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దొడ్డికొండ గ్రామంలో బుధవారం రగ్గులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు 2013 నుంచి చేస్తున్నామని, సాయిశక్తుల మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డికొండ గ్రామస్తులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న మోహన్

సాగు పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-చింతపల్లి: సేంద్రియ వ్యవసాయంలో వినూత్న పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలం గడపరాయి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎపి సిఎస్ఎఫ్, ఆర్‌వైఎస్ఎస్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చింతపల్లి యూనిట్ ఇంచార్జ్ కొర్ర మోహన్, వివోఏ చంద్రకళ, ఐసిఆర్‌పి.బొజ్జిపడాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ, వ్యవసాయం రసాయనిక ఎరువులు, పురుగుమందులతో కలుషితమౌతున్న పరిస్థితుల్లో సాగుకు సహజసిద్ధమైన పూర్వవైభవం రావాలన్నా కాలుష్య రహిత వాతావరణం సిద్ధించాలన్నా సహజసిద్ధమైన సేంద్రియ ఎరువులతో సాగుచేసే ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారానికి, భావితరాలకు కాలుష్యరహిత వాతావరణం అందించేందుకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రతిఒక్కరూ అవలంభించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తక్కువ భూమిలో కిచెన్ గార్డెన్స్ వేసుకోవాలని సూచించారు.


దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ అనైతికం

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ అనైతికమని యునైటెడ్ డాక్ అండ్ పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు అన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 93వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం అనర్థమని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధికి వైజాగ్ పోర్టు కీలకమని, ఏటా మున్సిపాలిటీకి సగటున రూ.65 కోట్లు పన్నులు కడుతున్న పోర్టును ప్రయివేటుకు ధారాదత్తం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందని చెప్పారు. ఆసుపత్రి ప్రయివేటీకరణకు టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్మిక వర్గ పోరాట ఫలితంగానే వాయిదా వేశారని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్సు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయం అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, శంకరరావు, సిహెచ్.త్రినాధరావు, కెఎస్.కుమార్, శ్రీను, రాఘవులు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం
- మందు గుండు సామగ్రి పేలి ఒకరు మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : నూతన సంవత్సర వేడుకల్లో మంగళవారం రాత్రి విషాదం నెలకొంది. వడ్లపూడి రజకవీధిలో మంగళవారం రాత్రి కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. సద్దుమల్ల శివ బాణాసంచా కాల్చాడు. ఒకటి పేలకపోవడంతో దగ్గరికి వెళ్లి పరిశీలిస్తుండగా అది పేలి తలకు బలంగా తగిలింది. దీంతో తీవ్ర గాయాలపాలైన శివను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దువ్వాడ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


నమూనాలను తిలకిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిట్టివలస డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జివిఎంసి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆలోచింపజేసింది. జివిఎంసి పిఎస్ఎం హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్.జస్వంత్‌కుమార్ ప్రదర్శించిన "డిఫెన్స్ రోబోటిక్స్" నమూనాకు, మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బి.రాకేష్, జి.సూర్యతేజ తదితరులు తయారుచేసిన ప్రదర్శించిన "ఆటోమేటిక్ రూమ్ లైట్" నమూనాలకు ప్రథమ స్థానం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపిపి బోని బంగారు నాయుడు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడుతో కలిసి ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, యుపి పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రతిభ చూపి, జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంపిపి, జెడ్‌పిటిసితో పాటు ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, జయప్రద, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం జె.రాధాకుమారి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి తదితరులు

రిటైర్మెంట్ పేరుతో కార్మికులను తొలగించొద్దు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో రిటైర్మెంట్ పేరుతో కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి కోరారు. జివిఎంసి వద్ద బుధవారం యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త సంవత్సరం మొదలు 60 ప్లస్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రిటైర్మెంట్ పేరుతో తొలగించడం దుర్మార్గం అన్నారు. కడుపుకొట్టి ఇంటికి పొమ్మంటున్న కూటమి ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ, విధులలో ఉన్న కార్మికులను వెంటనే ఆగిపొమ్మని చెప్పడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఇచ్చి, కార్మిక కుటుంబాల సభ్యులకు ఉపాధి అవకాశం కల్పించే వరకు ఎవరినీ తొలగించొద్దన్నారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యాన ఈ నెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు జివిఎంసి మెయిన్ ఆఫీస్ గేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. రిటైరైన, చనిపోయిన, లాంగ్ ఆబ్‌సెంట్ కార్మికుల కుటుంబ సభ్యులు ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఇ.ఆదినారాయణ, జెఆర్.నాయుడు, వెంకటరావు, మీనాక్షి, గణేష్, అనిల్, ఈశ్వరరావు, సురేష్, శ్రావణ్‌కుమార్, శేషు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-లీగల్ : ఇటీవల రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్‌చేశారు. మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిపై అనంతపురం జిల్లా లక్కిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి దురుసు ప్రవర్తనను యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఆయన అరెస్టు అప్రజాస్వామికమని, చట్టానికి విరుద్ధంగా సినిమాలో వలె వీధులలో కాలర్ పట్టుకుని లాక్కెళ్లటం సభ్య సమాజం, న్యాయవాదులు జీర్ణించుకోలేని విషయమని, దీనిపై చట్టపరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని యూనియన్ ఆలిండియా రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయరావు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా 3 టౌన్ పోలీస్ స్టేషన్‌కు సివిల్ కేసులో లాయర్ శేషాద్రికి నోటీసులిచ్చి స్టేషన్‌కు పిలిపించి దురుసుగా ప్రవర్తించారని, ఒత్తిడికి లోనై గుండెపోటుతో మరణించిన న్యాయవాదిని కనీసం 108 వాహనంలో కూడా పంపించకుండా ఆటోలో ఇంటికి పంపించడం విచారకరమని పేర్కొన్నారు. సదరు పోలీసు అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని, వారిని విధుల నుంచి తొలగించాలని, విచారణ చేపట్టి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం పలు కేసులలో ఇస్తున్న సూచనలను, నిబంధనలను పక్కనపెట్టి చట్టాన్ని చేతిలోకి తీసుకుని న్యాయవాదులపై చేస్తున్న దాడులకు భవిష్యత్తులో పోలీసు అధికారులు మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిజిపి, హోంమంత్రి అనిత స్పందించి సంబంధిత పోలీసుల అధికారులపై చర్యలతో పాటు తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టానికి రూపకల్పన చేసి, వారి హక్కులను రక్షించాలని కోరారు.

3 నుంచి జిమ్‌సర్ వేదికగా డిఎస్ఐ వార్షిక సమావేశాలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) డివిఎల్, పాథాలజి విభాగాల ఆతిథ్యంలో జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు డెర్మటోపాథాలజి సొసైటీ ఆఫ్ ఇండియా (డిఎస్ఐ) 27వ వార్షిక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు గీతం డెర్మటాలజి విభాగాధిపతి డాక్టర్ బివి.రామచంద్ర, పాథాలజి విభాగాధిపతి డాక్టర్ జి.రాజా ప్రమీల తెలిపారు. ఈ సమావేశాలకు దేశం నలుమూలల నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు హజరు కానున్నారని పేర్కొన్నారు. ఛాలెంజింగ్ దా డొగ్‌మా అనే అంశంపై జరిగే ఈ సమావేశాలలో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు హజరై ప్రసంగిస్తారని తెలిపారు. డెర్మటోపాథాలజిలో వస్తున్న వైద్య ప్రగతిపై అవగాహన, చర్చలు ఉంటాయన్నారు.

భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 1818 జనవరి 1న దాదాపు 500 మంది మహార్ యోధులు పీష్వా సైన్యాన్ని చిత్తుగా ఓడించినందుకు గుర్తుగా భీమా కోరేగావ్ మహార్ వీరుల స్ఫూర్తితో, దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను బలోపేతం చేద్దామని తెలుపుతూ భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ బుధవారం నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం మీదుగా డాబా గార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షుడు నేతల భోగేష్ నాయకత్వంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ర్యాలీ చేస్తున్న అంబేద్కర్ ఇండియా మిషన్

నేటి నుంచి శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతర వేదికగా గురువారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకూ అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పరిపాలనాధికారి టి.విశ్వనాధరెడ్డి తెలిపారు. భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్ సౌజన్యంతో దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి 100 మంది చేనేత కళాకారులు రూపొందించిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు

టిఎన్‌టియుసి డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీలేరు : తెలుగు నాడు కార్మిక సంఘం రూపొందించిన నూతన డైరీ, క్యాలెండర్‌ను సీలేరు కాంప్లెక్స్ పరిధి ఏపీ జెన్కో మోతుగూడెం చీఫ్ ఇంజనీర్, ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈ ఓ అండ్ ఎం రాజేంద్రప్రసాద్, ఈఈ సివిల్ శ్రీనివాస్‌రెడ్డి చేతులు మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి రీజనల్ ప్రెసిడెంట్ భాస్కరరావు మాట్లాడుతూ ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తెలుగు నాడు డైరీ, క్యాలెండర్‌ను అధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు తెలుగు నాడు కార్మిక సంఘం బ్రాంచ్ అధ్యక్షులు ఆర్.అప్పారావు, వరప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనపై దృష్టి
- ప్రభుత్వ విప్ చిరంజీవిరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యువతకు ఉద్యోగాలు కల్పించడంపై దృష్టి సారించినట్టు ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. నిరుద్యోగులకు 2025 స్వర్ణయుగం కావాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల మంది నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సంతకం డిఎస్‌సిపై పెట్టారన్నారు. ఎస్‌సి వర్గీకరణ వల్ల డిఎస్‌సి నోటిఫికేషన్ రావడానికి ఆలస్యమవుతోందని తెలిపారు. జనవరి చివరలోగానీ, ఫిబ్రవరి మొదటి వారంలోగానీ డిఎస్‌సి నోటిఫికేషన్ రానుందన్నారు. రానున్న జూన్ నెలకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి విధుల్లోకి పంపించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. గత ఐదేళ్లలో కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కానిస్టేబుల్ పోస్టుల భర్తీని వేగవంతం చేసిందన్నారు. 2025లో ఎపిపిఎస్‌సి ద్వారా ప్రతి నెలలో పరీక్షలు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ఎపిపిఎస్‌సి ద్వారా సుమారు 20 నోటిఫికేషన్లు వచ్చాయన్నారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పామని, ఈ క్రమంలో ఓ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్రంలో 820 ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. ఈ ఏడాదిలో సమయం వృథా చేయకుండా నిరుద్యోగులు చదువుకుంటే ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడతారని చెప్పారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గిస్తున్నామన్నారు. త్వరలో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగనుందని తెలిపారు.

ఇగ్నో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జనవరి - 2025 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకు మంగళవారం ప్రకటన వెలువడింది. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇగ్నో వెబ్‌సైట్ https://ignouad-mission.samarth.edu.inలో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని, అన్ని కోర్సులలో ప్రవేశాలకు గడువు తేదీ జనవరి 31 అని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నింటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుందని, ఫీజులు ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉందని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్ లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

న్యూ ఇయర్ సందడి

ఉత్సాహంగా వేడుకలు


విఆర్.పురంలో పాటలు పాడుతున్న క్రైస్తవ కళాకారిణులు

ప్రజాశక్తి-విఆర్.పురం
మండలంలోని పలు చర్చిల్లో బుధవారం ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ప్రార్థనా మందిరాలను సుందరంగా అలంకరించి కేక్‌లు కట్ చేశారు. ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విఆర్.పురం సంతపాకల వద్ద ఉన్న షాలోమ్ ప్రేయర్ హౌస్ ప్రార్థన మందిరంలో పాస్టర్ డేవిడ్ లివింగ్ స్టన్ ఆధ్వర్యాన జరిగిన నూతన సంవత్సర వేడుకలు కేక్ కట్ చేశారు. పిల్లలు పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ డేవిడ్ లివింగ్ స్టన్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పంటలు మంచి దిగుబడి వచ్చి రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. యువతీ యువకులు చెడు మార్గంలో పోకుండా, చెడు వ్యసనాలకి దూరంగా ఉండాలని. విద్యార్థులు చదువులు పట్ల ఆసక్తి చూపించాలని, టెన్త్ ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలని కోరారు. అనంతరం సంఘస్థులకు, గ్రామ ప్రజలకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘస్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జి.మాడుగుల : మండలంలోని చుట్టుమెట్ట గ్రామంలో గ్రోత్ ఇన్ క్రైస్ట్ మిషన్ సాలం చర్చిలో బిషప్ వి.తిమోతి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాస్టర్లను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో వి.రాజ్‌కుమార్ కె సుబ్బారావు, కె ప్రసాద్, కె రాజబాబు, జి జానీబాబు, నాగేష్, వి దీనమ్మ, కె.ముత్యాలమ్మ, వసంత, వరహాలమ్మ, క్రైస్తవులు పాల్గొన్నారు.

మన్యంలో న్యూ ఇయర్ సందడి

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర సందడి నెలకొంది. మంగళవారం సాయంత్రం నుంచే ప్రతి గ్రామంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇంటి ముంగిట్లో మహిళలు రంగవల్లులు వివిధ ఆకృతులతో వేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో థింసా నృత్యాలు, చిన్నారులు డాన్స్‌లు, ఆటపాటలు ఎంతగానో అలరించాయి. సీలేరు యుసీఐఎం, పెంతుకోస్తు, గీస్తేమని కల్వర్, సాలెం చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి అర్ధరాత్రి కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పలు గ్రామాల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకుని సంబరాలు అంబరాన్ని తలపించే విధంగా జరుపుకున్నారు.

ముంచింగిపుట్టు : మండలంలో పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు కనువిందుగా జరిగాయి. మండల రెవెన్యూ కార్యాలయంలో తహశ్శీల్దార్ నరసమ్మ ప్రత్యేక చొరవతో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో కేకును కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు కార్యాలయం ఆవరణలో రంగురంగుల రంగవల్లికలతో ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు. మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, కార్యాలయ సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డిటి, ఆర్ఐ, విఆర్ఒలు, విఆర్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్చిల్లో కేక్‌లు పంపిణీ

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో యూసీఐఎం, పెంతుకోస్తు, గెస్టమని, కల్వర్, సాలెం చర్చిల్లో పంచాయతీ సర్పంచి పాంగి దుర్గ, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, వి.అప్పారావు శ్యామ్ సన్, కారే బంగారయ్య కేకులు పంపిణీ చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని క్రైస్తవ మందిరాల్లో కేకులు పంపిణీ కార్యక్రమాన్ని కొన్ని సంవత్సరాలగా చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కేకులు చర్చిలకు అందజేసి హిందువులు, క్రైస్తవులు అనే విభేదం లేకుండా పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఎం.ధారబాబు, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సీలేరులో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న నాయకులు, స్థానికులు

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలానికిగాను స్టాప్ నర్సుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని, అందులో భాగంగా విశాఖపట్నం జోన్-1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయనున్నామని మెడికల్, హెల్త్ డిపార్టుమెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి మీడియాకు తెలిపారు. ఒక సంవత్సరం ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు 2025 జనవరి 1 నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పూర్తి చేసిన దరఖాస్తులను తమ కార్యాలయానికి అందజేయాలని కోరారు.



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, ముఠా కార్మికులు

అమిత్‌షా వ్యాఖ్యలపై కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ పూర్ణా మార్కెట్ వద్ద ముఠా కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి.చంద్రమౌళి, సిపిఐ నాయకులు ఎం.మన్మధరావు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. అమిత్‌షా బిజెపి అజెండా అయిన ప్రైవేటీకరణను సమర్థిస్తున్నారని, దీని అర్థం దేశ సంపదను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేయడమేనని అన్నారు. ఈ క్రమంలోనే రకరకాల పద్ధతుల్లో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు భారత జాతికే అవమానకరమన్నారు. కులాలను, మతాలను, చివరికి రాజ్యాంగ నిర్మాతను వివాదాల్లోకి లాగడం అత్యంత హేయమైన చర్య అన్నారు. అమిత్‌షా వ్యవహారంపై ప్రధాని మోడీ స్పందించాలని కోరారు. ఆయనపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాసీల నాయకులు పైడిరాజు, ఆర్.నాయుడు, నర్సింగరావు, మహేష్, నారాయణ, రమణ, సంజీవ్, సాంబ, శ్రీను, సూరి పాల్గొన్నారు.

31వ వార్డులో పాదయాత్ర

అమిత్‌షా వ్యాఖ్యలపై జివిఎంసి 31వ వార్డు కృష్ణాగార్డెన్స్, భీమ్ నగర్ ప్రాంతాల్లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ అమిత్‌షా వంటి దేశద్రోహులను కఠినంగా శిక్షించాలన్నారు. తక్షణమే హోం మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు కె.చంద్రశేఖర్, కెవిపి.చంద్రమౌళి, కె.నర్సింగరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో సెల్ ఫోన్లపై.. దర్యాప్తు ప్రారంభం

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్ల ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. ఉన్నతాధికారులు ఆ దిశగా విచారణ చేపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఇదే కారాగారంలోని ఖైదీలకు గంజాయి, మత్తు పదార్థాలు చేరిన విషయం బయటకు రావడం, తాజాగా సెల్‌ఫోన్లు దొరకడం వంటి వరుస ఘటనలతో కారాగార నిర్వహణ తీరుపై ప్రస్తుతం ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది. హై సెక్యూరిటీతో ఉన్న పెన్నా బ్యారక్ వద్దగల గార్డెన్‌లో మంగళవారం నాలుగు అడుగుల లోతులో పాతిపెట్టిన సెల్‌ఫోన్లు, బ్యాటరీ, పవర్ బ్యాంక్, కీ ప్యాడ్ లభించడంతో కలకలం రేగిన విషయం తెలిసిందే. ఈ విషయమై జైలు అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. సెల్‌ఫోన్ల వ్యవహారంలో సంబంధిత వ్యక్తులు వాటిలో వాడిన సిమ్ కార్డులు దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సెల్ ఫోన్లు ఎప్పటి నుంచి ఇక్కడ ఉన్నాయి ? వాటిని ఎవరు ఖైదీలకు అందించారు ? సెల్ ఫోన్లు వాడిన ఖైదీలు ఎవరు ? ఎవరితో సంభాషించారు ? అన్న విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దొరికిన స్మార్ట్ ఫోన్‌లో ఉన్న ఐఎంఇఐ కోడ్ ఆధారంగా ఏయే సిమ్‌లు వాడారు, ఆ సిమ్‌లు ఏ ఆధార్‌తో లింకై ఉన్నాయి ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. హై సెక్యూరిటీ కలిగిన పెన్నా బ్యారెక్‌లో మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసిన కేసులోనూ, మరో హత్య కేసులోనూ నిందితుడైన రౌడీ షీటర్ హేమంత్, మరో రౌడీ షీటర్ (రిమాండ్ ఖైదీ) రాజేష్ ఉన్నారు. వారికోసమే సెల్ ఫోన్లు దాచి ఉండొచ్చని జైలు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సెల్‌ఫోన్లు చాలా రోజుల నుంచే ఇక్కడ వాడుతున్నట్టు అనుమానాలున్నాయి. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో ఇప్పటికే కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి, అదనపు పర్యవేక్షణాధికారిపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.